# కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**తెలంగాణ ఆయిల్ ఫెడ్ చైర్మన్ రామకృష్ణారెడ్డి**



మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

కురవి, జూలై 19 : ఆయిల్ పాం సాగు చేసే రైతులు గెలల సేకరణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ ఆయిల్ ఫెడ్ చైర్మన్ కే రామకృష్ణారెడ్డి అన్నారు. కురవి మండలం అయ్యగారిపల్లి గ్రామంలోని రైస్‌మిల్లులో ఆయిల్ పాం గెలల సేకరణ కేంద్రాన్ని బుధవారం చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. రైతులు గెలలను కొనుగోలు కేంద్రానికి తీసుకుని రావడం ద్వారా ఖర్చు ఆదా అవుతుందని, సమయం కలిసి వస్తుందన్నారు. జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సూర్యనారాయణ మాట్లాడుతూ.. త్వరలోనే తొర్రూరులో ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామన్నారు. ఆయిల్‌పాం సాగుచేసే రెండు మూడు గ్రామాలకు ఒక సేకరణ కేంద్రాన్ని ఏర్పాటుచేయాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎంటీఎస్ ఆయిల్‌ఫెడ్ సుధాకర్‌రెడ్డి, రాయల్‌ఫీడ్ తెలంగాణ అసిస్టెంట్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్‌లు జ్యోత్స్న వెంకట్‌రెడ్డి, యానాల గంగాధర్‌రెడ్డి, రాములు, సత్యంబాబు, ఉద్యానవన శాఖ అధికారులు అనిత శ్రీ, విష్ణు, ఆయిల్‌పాం రైతులు భరద్వాజరెడ్డి, వెంకట్‌రెడ్డి, మల్సూరు, నరేందర్‌రెడ్డి, దిట్టకవి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ హాస్టల్ విద్యార్థులకు పండ్లు పంపిణీ

డోర్నకల్, జూలై 19 : లయన్స్ క్లబ్ పూర్వ గవర్నర్ టీ లక్ష్మీనర్సింహ రావు పుట్టిన రోజు సందర్భంగా డోర్నకల్ లయన్స్ క్లబ్ సభ్యులు బుధవారం రాత్రి ఎస్సీ, ఎస్టీ హస్టల్ విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ డాక్టర్ విత్తనాల సుధాకర్ మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పసల అంటోనీ, కార్యదర్శి నల్లబోలు శ్రీనివాస్, లయన్స్ సభ్యులు కాలా యశోధర్ జైన్, పాటి రమేశ్, కనక రాజు, కందుల నరేశ్, బోమ్మన అశోక్ పాల్గొన్నారు.




పండ్లు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

## సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

గూడూరు, జూలై 19 : సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ వైద్యుడు యమున, డాక్టర్ రాంబాబు తెలిపారు. బుధవారం స్థానిక గూడూరు సీహెచ్‌సీ దవాఖానలో అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేపటి నుంచి 19 ఏండ్ల పిల్లలకు నులిపురుగుల నివారణకు అల్బెండ జోలే మాత్రలను అందించాలని తెలిపారు.

## డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్‌కు సన్మానం

గార్ల, జూలై 19 : సీహెచ్‌సీ వైద్యాధికారి రాజ్ కుమార్ జాదవ్‌కు తెలంగాణ ప్రభుత్వం సేవలపై వైద్య రత్న అవార్డు అందజేసింది. కాగా, బుధవారం ఈ సందర్భంగా గార్ల గణేశ్ యువ సేన సభ్యుడు రాజ్‌కుమార్ జాదవ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. గణేశ్ యువ సేన సభ్యుడు విశాల్ జైన్, కట్టా రమేశ్, రాకేశ్, కే మనోజ్, శ్రీకాంత్, మహేశ్, రామారావు ,రోహిత్, సాయి, రాజేశ్ పాల్గొన్నారు.

## దంతాలపల్లి ఎస్సైగా రమేశ్‌బాబు బాధ్యతల స్వీకరణ




బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్సై రమేశ్‌బాబు

దంతాలపల్లి, జూలై 19 : దంతాలపల్లి పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా రమేశ్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. గతంలో దంతాలపల్లి ఎస్సైగా పనిచేసిన జగదీశ్ తొర్రూర్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్లగా మహబుబాబాద్ టాస్క్‌ఫోర్స్ విభాగంలో పనిచేస్తున్న రమేశ్‌బాబును దంతాలపల్లి ఎస్సైగా ప్రభుత్వం బదిలీ చేయగా, బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఎస్సైకి సిబ్బంది స్వాగతం పలికారు.

## బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే శంకర్‌నాయక్ పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

కేసముద్రం, జూలై 19: మండలంలోని బిచ్చానాయక్ తండాలో బీఆర్‌ఎస్ గ్రామ మాజీ అధ్యక్షుడు బాషానాయక్ మృతి చెందడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ బుధవారం పరామర్శించారు. ఆయన మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ. 5 వేల సాయం అందజేశారు. మండల కేంద్రానికి చెందిన మాజీ వార్డు సభ్యులు లలిత తల్లి అందె వెంకటమ్మ మృతి చెందగా, ఆమె మృతదేహానికి ఎమ్మెల్యే శంకర్‌నాయక్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు రూ.5 వేలు సాయం అందించారు. ఆయన వెంట జడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, జిల్లా సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మాదారపు సత్యనారాయణరావు, మండల పార్టీ అధ్యక్షుడు నజీర్ అహ్మద్, సింగిల్ విండో డైరెక్టర్ కొండ్రెడ్డి రవిందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు కముటం శ్రీనివాస్, గుగులోత్ వీరునాయక్, ఆగె వెంకన్న, నరేశ్, రవీందర ఉన్నారు.

## కొత్తపేటలో ప్లాస్టిక్ నిషేధం

బయ్యారం, జూలై 19 : మండలంలోని కొత్తపేటలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధిస్తున్నట్లు పాలక వర్గం బుధవారం నిర్ణయం తీసుకున్నట్లు సర్పంచ్ మమత, ఎంపీడీవో చలపతిరావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధించినప్పటికీ జీపీలోని గ్రామాల్లో ప్లాస్టిక్ వాడకం అధికంగా చేస్తున్నందున నేటి నుంచి (గురువారం ) నిషేధించాయని తెలిపారు. వ్యాపారస్తులు కావర్లు అమ్మవద్దని తెలిపారు. గ్రామస్తులు కూడా క్లాత్ కవర్‌లనే వాడి ప్లాస్టిక్ రహిత పంచాయతీ దిశగా చేస్తున్న కృషికి సహకరించాలని సూచించారు.

# అల్లరి




### చెప్పుకోండి



1. భారత వ్యవసాయ పరిశోధనా సంస్థ ఎక్కడ ఉన్నది?
2. ఫలక్‌నుమా ప్యాలెస్‌ను నిర్మించింది ఎవరు?
3. స్టెతస్కోప్‌ను కనుగొన్నది ఎవరు?

### పదసృష్టి




కింద ఇచ్చిన పదంలోని అక్షరాల సాయంతో ఎన్ని కొత్త పదాలను సృష్టించగలరో చూడండి.

Father

Ex : Teeth

## నిజాయతీ

కథ



ఊరి బయట వేపచెట్టు కింద కూర్చుని బిచ్చమెత్తి తెచ్చుకున్న అన్నం తింటున్నాడు రంగయ్య. ఏదో ఆలోచిస్తూ తింటున్న అతని నోటికి ఏదో గట్టిగా తగిలింది. తీసి చూస్తే బంగారు ఉంగరం! 'ఇది నా జోలెలోకి ఎలా వచ్చింది?' అని తెగ ఆలోచించాడు. 'ఎవరో తల్లి కబళం వేసేటప్పుడు ఆమె చేతి ఉంగరం జారి జోలెలో పడినట్టుంది. ఇది ఎవరిదైతే వారికి ఇచ్చేయాలి. ధర్మం చేసిన వారికి నేను అధర్మం చేయకూడదు!' అనుకున్నాడు. కానీ, ఎవరికి ఇవ్వాలి? ఒక ఇంట్లో భిక్షమైతే గుర్తుపట్టవచ్చు. ఇవాళ పది ఇళ్లలో అన్నం అడుక్కున్నాడు. వాళ్లలో ఏ ఇల్లాలిదై ఉంటుంది? పోనీ ఊరిపెద్ద చలమయ్యకు ఇస్తే.. అసలువాళ్లకు చేర్చమని. కానీ, అతను పెద్ద అవినీతిపరుడు. తనే జేబులో వేసుకుంటాడు. తర్వాత తను వెళ్లి అడిగితే.. 'నువ్వు నాకు ఉంగరం ఇవ్వడం ఏంట్రా?' అని తన్ని తరిమేస్తాడు. జనం కూడా బిచ్చగాడి మాటలు నమ్మరు కదా? మరి ఎలా? తొందరపడకూడదు. జాగ్రత్తగా ఆలోచించి అసలు యజమానురాలికి దీన్ని చేర్చాలి అని ఆలోచించాడు. మర్నాడు బిచ్చానికి వెళ్లినప్పుడు ఆ ఇల్లాళ్ల ముఖ కవళికలు పరిశీలించడం మొదలుపెట్టాడు. వారి కుడి చేతివేళ్లను కూడా గమనించాడు. తొమ్మిది ఇళ్లలోని వారు ఎప్పటిలాగే చిర్రుబుర్రులాడుతూ ఎలాంటి విచారం లేకుండా భిక్షం వేశారు. కానీ, పదో ఇంటి ఇల్లాలు లక్ష్మీ రమణమ్మను భిక్షం వేస్తున్నప్పుడు పరిశీలనగా చూశాడు. ఆమె దిగులుగా ఉన్నట్టు అర్థమైంది. ఆవిడ కుడిచేతిని చూస్తే ఉంగరం లేదు కానీ, అది ఉండేదన్నట్టు వేలికి అచ్చు ఉంది. దాంతో తన జోలెలో పడిన ఉంగరం ఆమెదే అని తీర్మానించుకున్నాడు. లక్ష్మీరమణమ్మ భిక్షం వేసి లోపలికి పోబోతుండగా.. ''అమ్మగారూ!'' అని పిలిచాడు. ఆవిడ ఏంటన్నట్టు వెనుతిరిగి చూసింది. అప్పుడు తన చింకిపాతలో దాచిన ఉంగరాన్ని బయటికి తీసి, అరచేతిలో పెట్టుకుని ఆమెకు చూపి.. ''ఇది మీదే కదా అమ్మగారు?'' అని అడిగాడు. ఆవిడ కళ్లు ఆనందంగా మెరిశాయి. ''అవును బాబూ నాదే! నీకు ఎక్కడ దొరికింది?'' అన్నది ఆశ్చర్యంగా. ''నిన్న మీరు భిక్షం వేసేటప్పుడు నా జోలిలో పడిందమ్మా.. ఎవరిదా? అని ఆలోచించి ఆలోచించి బుర్ర వేడెక్కిపోయింది. అందుకనే ఇవాళ అన్నం వేసే అమ్మలందరినీ పరిశీలనగా చూశాను. వాళ్ల చేతివేళ్లు కూడా పరిశీలించాను. మీ ముఖంలో ఎప్పటిలా సంతోషం లేదు. పైగా దిగులు! మీ వేలికి ఉంగరం హద్దు ఉంది గానీ, ఉంగరం లేదు. అందుకే మీదేనని పోల్చుకున్నాను'' అన్నాడు ఉంగరం ఆమె చేతిలో పెడుతూ. ''అవును బాబు ఇది నాదే! ఇది పోయిందని రాత్రంతా నిద్ర లేదు. తిండి లేదు. నీ గొప్ప గుణానికి రెండు చేతులెత్తి మొక్కుతున్నాను. పేదవాడివైనా ఖరీదైన ఉంగరాన్ని తిరిగి తెచ్చిచ్చావు. నువ్వు నిజంగా గొప్పవాడివి బాబు'' అంటూ ఆనందబాష్పాలు రాల్చిందామె. ''మీలాంటి ధర్మ తల్లులకు దేవుడు ఎప్పుడూ అన్యాయం చేయడమ్మా!'' అని వెనుతిరిగి వెళ్లిపోయాడు రంగయ్య. వెళ్లిపోతున్న రంగయ్య ఆమెకు బిచ్చగాడిలా కాక.. సాక్షాత్తూ దేవుడిలా కనిపించాడు. మరోసారి అతనికి మొక్కి ఇంట్లోకి వెళ్లిపోయింది లక్ష్మీ రమణమ్మ.

**నీతి :** పేదవాడైనా.. ధనవంతుడైనా నిజాయతీ అవసరం.

• చంద్రప్రతాప్ కంతేటి

### పెద్దల మాట




కాంతి ఏ దీపం నుంచి వచ్చినా మంచిదే! గులాబీ ఏ తోటలో విరిసినా అందంగానే ఉంటుంది.

• సర్వేపల్లి రాధాకృష్ణన్

## ఐదు నదుల నేల

**పంజాబ్** పేరుతో మనదేశంలోనే కాదు పాకిస్తాన్‌లోనూ ఓ రాష్ట్రం ఉంది. మనది తూర్పు పంజాబ్, పాకిస్తాన్‌లోది పశ్చిమ పంజాబ్. ఈ పదం రెండు వేర్వేరు పదాల కలయికగా ఏర్పడింది. పర్షియా (ఇప్పటి ఇరాన్) భాషలో 'పంజ్' అంటే ఐదు, 'అబ్' అంటే నీళ్లు అని అర్థం. ఐదు నదుల




నీళ్లు ప్రవహించే నేల అనే అర్థంలో పంజాబ్‌కు ఆ పేరు వచ్చింది. పూర్వం గ్రీకులు ఈ ప్రాంతాన్ని పెంటాపొటేమియా (పెంటా– ఐదు, పొటేమియా– నదుల ప్రాంతం) అని పిలిచారు. ఆ ఐదు నదులు ఏవంటే..? జీలం, చినాబ్, రావి, సట్లెజ్, బియాస్. ఇవన్నీ పాకిస్తాన్‌లో మరో పెద్ద నది అయిన సింధు నదిలో కలుస్తాయి. ఈ నదులు తీసుకువచ్చిన ఒండ్రుమట్టి వల్ల పంజాబ్ ప్రాంతం ఎంతో సారవంతంగా ఉంటుంది. పంటలు బాగా పండుతాయి.

### ఆ పదమేంటి?


ఇచ్చిన అక్షరాలను బట్టి సరైన పదాన్ని కనుక్కోండి.



S _ _ _ _ _ _

O M N W A N

### లిటిల్ ఆర్టిస్ట్





జి. విస్మయి, 3వ తరగతి

**జవాబులు**

జవాబులు: 1. న్యూఢిల్లీ, 2. వికారుల్ ఉమ్రా, 3. రెనె లెనెక్

ఆ పదమేంటి? : snow man

పిల్లలూ! మీరు గీసిన బొమ్మలు, రాసిన కథలు, జోక్స్ మాకు పంపండి. బాగుంటే ప్రచురిస్తాం. మా చిరునామా: zindagi@ntnews.com